మూగజీవాలకు మెరుగైన వైద్యం

- ఇంటికే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ
- టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేస్తే ముంగిటకే వైద్యసేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పశుపోషకులు

108.. ఆపత్కాలంలో బాధితులకు అండగా నిలిచి ఎందరివో ప్రాణాలు కాపాడుతున్న అద్భుత వ్యవస్థగా పేరుగాంచింది. అలాగే పశువులకు కూడా అత్యవసర సమయంలో పోషకుల వద్దకే వెళ్లి వైద్య సేవలందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ కార్యక్రమాన్ని ప్రారంభించి పశు అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. అపదలో ఉన్న పశువు వద్దకే అన్ని వసతులతో ఉన్న వాహనం ద్వారా వైద్యులు చేరుకొని వైద్యచికిత్స అందజేస్తారు. ఏదైనా ఉన్నత వైద్యం అవసరమైతే అదే వాహనంలో వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తారు.

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలకు అంతులేని వ్యాధుల సోకి వాటికి సరైనా వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల కాలంలో పాడి పశువులు వింత వాధులతో అకాల మృత్యువు కారణంగా పశుపోషణ తగ్గుముఖం పడుతోంది. దీంతో పాడి రైతులను ప్రోత్సహించాలని, పశుగణాభివృద్ధి కోసం మూగజీవాలను వ్యాధుల నుంచి సంరక్షించేందుకు వైఎస్సార్ సంచార ఆరోగ్య సేవ పథకం అమలులోకి తీసుకొచ్చారు. నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం మండలాలకు ఒక పశు సంచార వాహనం, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలకు మరొక వాహనం (పశు అంబులెన్స్) ఏర్పాటు చేశారు. రోజు వారీగా ఉదయం 8 నుంచి సాయంకాలం 5గంటల వరకు వాహనం మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంటుంది. గ్రామీణ ప్రాంత ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1962 కాల్ చేస్తే చాలు.. పశువు వద్దకు వాహనంతో చేరుకుంటారు. వాహనంలో ఒక డాక్టర్, ప్యారాస్టాఫ్ ఉంటారు. వారు అక్కడకు చేరుకుని వైద్య సేవలు అందజేస్తారు. అత్యవసరం ఉన్న మూగజీవాలను వాహనంలోని కర్నూలు హిస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. కోసిగి మండలంలో 12,500 తెల్లపశువులు, 8,900 నల్ల పశువులు ఉన్నాయి.


మెరుగైన వైద్యం కోసం ఆవును హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం


ఇంటి వద్దకు వచ్చి ఆవుకు చికిత్స చేస్తున్న వైద్యులు

వాహనంలో ఉండే సౌకర్యాలు..

- ప్రతి పశు అంబులెన్స్‌లో ట్రావిస్‌తో పాటు వెయ్యి కిలోల బరువున్న మూగ జీవాన్ని తరలించేందుకు వీలుగా హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యం
- 20 రకాల పేడ సంబంధిత పరీక్షలు,15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా మైక్రోస్కోప్‌తో కూడిన లేబరేటరీ.
- ప్రాథమిక వైద్య సేవలతో పాటు సన్నజీవాలు, పెంపుడు జంతువులు, పక్షులకు సర్జరీలు చేసేందుకు వీలుగా సౌకర్యాలు. అలాగే సీజన్ వారీగా అవసరమైన వ్యాక్సిన్లు, అన్ని రకాల మందులు
- ప్రతి వాహనంలో పశు వైద్యుడు, వెటర్నరీ డిప్లొమా చేసిన సహాయకుడు,డ్రైవర్ కమ్ అటెండర్
- టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేసి పశువు అనారోగ్య సమాచారం తెలియజేస్తే చాలు.. రైతు ముంగిటకు వెళ్లి వైద్య సేవలు అందజేస్తారు. అవసరమైతే సమీపంలోని పశు వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం చేయిస్తారు. పశువు పూర్తిగా కోలుకున్న తరువాత తిరిగి ఉచితంగా అదే అంబులెన్స్‌లో రైతు ఇంటికి చేరుస్తారు.

ఇంటి వద్దకు వచ్చి వైద్యం చేశారు



కోసిగిలో సిద్దప్ప పాళెంలో నివాసం ఉంటున్నాం. మా ఆవుకు మిల్క్ ఫీవర్, మరో ఆవుకు లంపీ స్కిన్ వైరస్ వ్యాధి సోకింది. మూడు రోజులుగా ఆవు జ్వరంతో నడవలేక , గడ్డి తినకుండా పడుకుని ఉండిపోయింది. ఏమి చేయాలో అర్థం కాక ఆవును కోల్పోతాం అనుకున్నాం. పశు వైద్యశాలకు వెళ్లి సిబ్బందిని సంప్రదించగా వైద్యసేవలపై సమాచారమివ్వడంతో 1962కు ఫోన్ చేశాం. ఆదివారం సెలవు అని కూడా చూడకుండా ఇంటి వద్దకు సంచారం వాహనం వచ్చింది. ఆవులను పరీక్షించి టీకాలు వేశారు. పశువులకు ప్రమాదం తప్పడంతో ఎంతో సంతోషమైంది.

– అయ్యమ్మ, కోసిగి

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని పాడి పశువులను అభివృద్ధి చేసుకోవాలి. పశువుకు ఇబ్బంది ఉంటే 1962కు కాల్ చేస్తే చాలు మీ ఇంటి వద్దకే సంచారం వాహనం వచ్చి వైద్య సేవలు అందిస్తారు. ఉదయం నుంచి సాయకాలం వరకు అందుబాటులో ఉంటాం.

– డాక్టర్ షలీనా, పశువైద్యాధికారిణి

క్లుప్తంగా

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు


స్వామి వారి సమాధి వద్ద ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాలు, స్వామికి చాదర్ సమర్పించారు. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పార్కులు అభివృద్ధి చేస్తాం

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పార్కులన్నింటినీ అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంజీ కాలనీలోని పార్కును సందర్శించారు. ఇందిరానగర్, టీజీఎల్ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీలోని పార్కులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కాలక్షేపం కోసం వచ్చే విశ్రాంతి ఉద్యోగులు, వృద్ధులు, యువకులకు అనుగుణంగా, చిన్నారుల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

జర్నలిజాన్ని కాపాడాలి

ఆదోని రూరల్ : దేశంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టి జర్నలిజాన్ని కాపాడాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ కోరారు. గురువారం పట్టణంలో సేవ్ జర్నలిజం పేరుతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ముందుగా స్థానిక కోట్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించి అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు దేవరాజ్, గౌస్, నరేష్‌యాదవ్, నరసింహమూర్తి, ఉసేని, సునీల్, ధీరజ్, బషీర్ పాల్గొన్నారు.

రైతులు నష్టపోయేలా చేయొద్దు

పెద్దకడబూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకునే రైతు వ్యతిరేక నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించరాదని, వ్యవసాయ బావులకు విద్యుత్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, రైతులు నష్టపోయేలా చేయొద్దని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సహాయ కార్యదర్శి రాజు కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం వల్ల రైతులు ఎంతో నష్టపోతారన్నారు. అనంతరం తహసీల్దారు వీరేంద్రగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు


గెలుపొందిన పొట్టేలుతో నిర్వాహకులు

కోసిగి: మండలంలోని వందగల్లు గ్రామంలో ఉగాది పర్వదినం రెండో రోజు సందర్భంగా గురువారం పొట్టేళ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు కాల్వ లక్ష్మయ్య ప్రారంభించారు. పోటీల్లో మండలంలోని 30 గ్రామాల నుంచి పొట్టేళ్లు పాల్గొన్నాయి. ఇందులో జుమ్మాలదిన్నె గ్రామానికి చెందిన పొట్టేలు గెలుపొందింది. గెలుపొందిన పొట్టేలుకు రూ.10,016, ద్వితీయ బహుమతి వందగల్లుకు చెందిన పొట్టేలుకు రూ.5,016 నగదు బహుమతి అందజేశారు. గ్రామ పెద్దలు ఈరన్న, తిమ్మయ్య, జడలయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆ స్థలాలు గ్రామ పంచాయతీవి కాదు

ఆలూరు రూరల్: పట్టణంలోని హైవే-167 పక్కన బంకులు వేసి ఆక్రమించిన స్థలాలు గ్రామ పంచాయతీకి చెందినవి కాదని ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణకుమార్ వెల్లడించారు. ఆయన గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆదోని-బళ్లారి హైవేలో ఏర్పాటు చేసిన బంకుల స్థలాలు జాతీయ రహదారుల శాఖ ఆధీనంలోకి వస్తాయన్నారు. డ్రైనేజీ నుంచి ఒకటిన్నర మీటరు స్థలం తాగునీటి పైపులైన్ ఏర్పాటు కోసం కేటాయించినట్లు హైవే అథారిటీ ఇంజినీర్లు తెలిపారన్నారు. భవిష్యత్తులో పైపులైన్ ఏర్పాటు చేస్తే బంకులు తొలగించాల్సి వస్తుందని హైవే అధికారులు తెలిపారన్నారు. హైవేలో కాకుండా గ్రామ పంచాయతీ పరిధి స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రశాంతంగా జీవించండి

పత్తికొండ రూరల్: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. గురువారం రాత్రి కనకదిన్నె గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు


కోదండ రామస్వామిని దర్శించుకుంటున్న ఉరుకుంద ఈఓ రామాంజనేయులు

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో వెలిసిన శ్రీ జానకీ సమేత కోదండ రామస్వామి ఆలయంలో రెండోరోజు గురువారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, గాయత్రీ, రామాయణ పారాయణం, రామచరితమాన పారాయణ, హోమాలు చేపట్టారు. కార్యక్రమాలకు ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయ చైర్మన్ నాగరాజుగౌడ్, ఆలయ ఈఓ రామాంజనేయులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి గరుడాద్రి దత్తాత్రేయశర్మ, కృష్ణశర్మ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని బాపురం గ్రామ వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు గురునాథ్‌రెడ్డి అన్నారు. గ్రామంలో వెలసిన అంబాభవానిదేవి జాతర సందర్భంగా మంగళ, బుధవారల్లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపు పొందిన జట్లకు బహుమతులతో పాటు నగదు అందజేశారు. ఫైనల్ పోటీల్లో బాపురం వారియర్స్, కర్ణాటకకు చెందిన గాంధీనగర్ జట్లు తలపడగా గాంధీనగర్ జట్లు విజయం సాధించడంతో మొదటి బహుమతి రూ.10వేలు, రన్నర్ జట్టుకు రూ.5వేలు అందజేశారు. మఠం నిర్వహకులు శివగంగమ్మ, శివప్ప, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దేవిరెడ్డి, పామిరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

శ్రీ మఠంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప,పంచామృతాభిషేకాలు చేపట్టారు. మూలబృందావనాన్ని బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఆశీనులు గావించి మాఢ వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

పోటెత్తిన కర్ణాటక భక్తులు: ఉగాది పండుగ సందర్భంగా శ్రీశైలంలో కొలువు దీరిన శ్రీభ్రమరాంబసమేత మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి భారీగా భక్తులు పాదయాత్రగా వెళ్లడం అనవాయితీ. అయితే ఉగాది పండుగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లోని ఆయా జిల్లాలకు చెందిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో క్షేత్రంలో వాహనాల రద్దీ నెలకొంది. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆదోని అర్బన్: స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 92వ వర్ధంతిని జరుపుకున్నారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి, పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్‌కుమార్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.నాయకులు మోహన్, వినోద్‌కుమార్, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని మంత్రాలయంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి జయరాజు, శారదాస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు థామస్ వేర్వేరుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కౌతాళం:భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉలిగయ్య, వెంకటేశ్, వలి పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురువారం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, డివిజన్ నాయకుడు రసూల్, వెంకటేష్, శేఖర్, చంద్ర, ఇర్ఫాన్, మహబూబ్‌బాషా, శివ పాల్గొన్నారు.

కోసిగి: స్వాతంత్ర సమర యోధుడు భగత్ సింగ్ రాజ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, వీరేంద్ర కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : భగత్‌సింగ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు రాజు, జాఫర్‌పటేల్, డీవైఎఫ్ఐ నాయకుడు దాస్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. సాయంత్రం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ చేపట్టారు.

పరీక్ష కేంద్రం మార్పు


కోసిగి పోలీస్ స్టేషన్‌లో పది పశ్నా పత్రాలను భద్రపరస్తున్న అధికారులు

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించే పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు మార్చినట్లు బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలకంఠ తెలిపారు. గురువారం పదో తరగతి సెట్-1 పరీక్ష ప్రశ్నా పత్రాలు మండల కేంద్రానికి చేరుకోగా పరీక్షల చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల సమక్షంలో పోలీస్ స్టేషన్‌లో భద్ర పరిచారు. ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ గ్రామానికి 3 కి.మీ. దూరంగా ఉండడంతో విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఆ పరీక్ష కేంద్రాన్ని అక్కడ నుంచి కోసిగి బాలికల ఉన్నత పాఠశాలకు మార్పు చేస్తు అనుమతులు వచ్చినట్లు తెలిపారు. కోసిగిలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మౌంట్ కార్మెల్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. బాలికల ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. ఈ కేంద్రానికి పరీక్షల చీఫ్ నీలకంఠ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ లచ్చప్పను నియమించారన్నారు. అలాగే బాలుర ఉన్నత పాఠశాలలో 295 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా పరీక్షల చీఫ్‌గా కృష్ణమూర్తి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మౌంట్ కార్మెల్ పాఠశాలలో 297 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని, ఈ కేంద్రానికి పరీక్షల చీఫ్ శోభరాణి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సిద్దప్పను నియమించారని వివరించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటాయని చెప్పారు.

ఘనంగా ఎమ్మెల్యే సాయి జన్మదిన వేడుకలు

ఆదోని టౌన్ : ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి 60వ జన్మదిన వేడుకలను గురువారం నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళా నాయకురాళ్లు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేకు కట్ చేసి అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు పంచి పెట్టారు.

మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి



ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న అజాత శంభులింగ శివాచార్య స్వామి

హొళగుంద: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని మంచి మార్గంలో నడవాలని జంగమర హొసళ్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య స్వామి భక్తులకు సూచించారు. ఎల్లార్తి గ్రామంలో గురువారం రాత్రి శివశరణి మహాసాధ్వీ హేమరెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచన కార్యక్రమం ప్రారంభమైంది. స్వామి చేతుల మీదుగా పురాణ కార్యక్రమం ప్రారంబమవగ! విశ్వారాధ్యశాస్త్రీ పురాణాన్ని భక్తులకు చదివి వినిపించారు. ప్రవచన కార్యక్రమం 26వ తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రమణీయం.. గిడ్డాంజనేయస్వామి రథోత్సవం

- జై శ్రీరాం నామ స్మరణతో మార్మోగిన తారాపురం
- తరలివచ్చిన భక్తజనం


తారాపురంలో అశేష భక్త జనుల మధ్య రథోత్సవం జరుగుతున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని తారాపురం గ్రామంలో వెలసిన శ్రీ గిడ్డాంజనేయస్వామి రథోత్సవం గురువారం రమణీయంగా సాగింది. పెద్దకడబూరు, ఆదోని చుట్టుపక్క నుంచే కాక కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులతో గ్రామం కిటకిటలాడింది. రథోత్సవ సందర్భంగా జై శ్రీరాం నామస్మరణతో గ్రామం పులకించి పోయింది. తెల్లవారుజామున ఆలయ పూజార్లు స్వామి వారికి జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పార్చన, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా గ్రామపెద్ద ఓంకారప్ప ఇంటి నుంచి కుంభం ఊరేగింపుగా రథం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆయలం నుంచి గజమాలతో ఊరేగింపుగా వచ్చి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై అదిష్టించి భక్తుల జై శ్రీరాం నినాదాలతో హోరెత్తిస్తుండగా రథాన్ని ముందుకు లాగారు. తిమ్మప్పతాత గుడిదగ్గరికి లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూత్ రాష్ట్ర కమిటీ సభ్యులు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి స్వామివారికి ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

మహిళా కబడ్డీ విజేత హర్యానా


తలపడుతున్న హర్యానా-అనంతపురం జట్లు

తుగ్గలి: క్రీడలు మానసిక పరిపక్వతను పెంచుతాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఊటకంటి అమరనాథరెడ్డి అన్నారు. ఉగాది పండుగ, చౌడేశ్వరీదేవి ఉత్సవాల సందర్భంగా రెండు రోజులుగా కడమకుంట్లలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్ పోటీలో హర్యానా జట్టు విజేతగా నిలవగా తమిళనాడు జట్టు రన్నర్స్‌గా నిలిచింది. తర్వాతి స్థానాల్లో వైజాగ్, కేరళ, బెంగళూరు, గుజరాత్ జట్లు నిలిచాయి. విజేతలకు టోర్నమెంట్ నిర్వాహకులు అమరనాథ రెడ్డి రూ.75 వేలు, రన్నర్స్‌కు రాతన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వర రెడ్డి రూ.50 వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా గ్రామ వలంటీర్లు రూ.30 వేలు, బాసాని లక్ష్మినారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి రూ.20వేలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రూ.10వేలు, ఊటకంటి సంజీవరెడ్డి రూ.5 వేలు అందజేశారు. అమరనాథ రెడ్డి మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పోటీలను తిలకించారు. బెస్ట్ రైడర్, డిఫెండర్లకు పలువురు ప్రోత్సాహక నగదు అందించారు. వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, రమేష్, రామాంజినేయులు, బాబునాయక్ పాల్గొన్నారు.

శ్రీరామ చరిత్ర జగతికి స్ఫూర్తి

కర్నూలు కల్చరల్: శ్రీరామచంద్రుని చరిత్ర సమస్త మానవాళికి ఆదర్శమని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో శ్రీమద్రామాయణ సప్తాహం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ చరిత్ర జగతికి స్ఫూర్తి అన్నారు. మొదటి రోజు శ్రీరామనవమి విశిష్టతపై విశ్రాంత మండల విద్యాశాఖాధికారి, ధార్మిక ప్రవచకులు ఇల్లూరి నాగరత్నం శ్రేష్ఠి ఉపన్యసించారు. కార్యక్రమంలో దేవస్థానం భజన మండలి అధ్యక్షులు మల్లేష్, సభ్యులు రాధాకృష్ణ మోహన్‌రావు, నరసప్ప, నరేష్, దాసు, అర్చకులు క్రమధాటి గిరీశ్వర శర్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


మిట్టసోమాపురంలో పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మిదేవి

నందవరం: మండలంలోని మిట్టసోమాపురం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎడ్ల బండులాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తెలుగు లక్ష్మిదేవి పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో రైతు ఏసన్న ఎడ్లు మొదటి స్థానంలో నిలిచి రూ.12,016 నగదు గెలుపొందాయి. రెండో స్థానంలో చిట్టిబాబు వృషభాలు రూ.8,016, మూడో స్థానంలో జాన్ ఎడ్లు 5,016, నాల్గవ స్థానంలో రాజు ఎడ్లు నిలిచి రూ.3,016 గెలుపొందాయి. దాతలు సర్పంచ్ లక్ష్మిదేవి, పెద్ద నరసింహులు, పీఎంసీ చైర్మన్ రామాంజనేయులు చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, లింగన్న, తాయన్న, వెంకటేష్, చిన్న నరసింహులు పాల్గొన్నారు. కాగా పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు, ఔత్సాహి కులు తరలి వచ్చారు. దీంతో గ్రామ వీధులు కిక్కిరి శాయి.